

# భామినీ బాడీగార్డ్!

అందే గోపాల కృష్ణమూర్తి

జిల్లాపరిషత్ బస్టాప్‌లో స్నేహితురాలితో నిల్చున్న ఉష నవ్వింది. ఎదురుగా నిల్చొన్న గోపాలం ఇబ్బందిగా ఫీలై కళ్ళజోడు సర్దుకున్నాడు. ఏదో గుసగుసలాడి ఉషారుగా మళ్ళీ నవ్వింది ఉష. ఈ సారి ప్రక్కమ్మాయి కూడా జాయినవ్వ ఇద్దరూ డ్యూయెట్టుగా నవ్వేరు. గోపాలాన్కి ఉక్రోషం ముంచుకొచ్చింది. సాయం ఎవరూలేరు గాని లేకపోతే తనూ ఘోరంగా నవ్వేసేవాడే! ఇప్పుడొక్కడూ తనలో తానుగా నవ్వుకొంటే పిచ్చాడనుకొంటుంది ఉష. అంచేత నవ్వకుండా అలానే బిగుసుకుపోయి నిల్చొని, కర్చీఫ్‌తో ముఖం తుడుచుకొన్నాడు.

పెద్ద సొదచేసికొంటూ వచ్చి ఆగింది నెంబర్ టెన్. ఉషా, స్నేహితురాలూ ఒక్క ఉదుటున బస్సెక్కి సెటిలైపోయారు మాంఛి రష్‌గా ఉన్నదేమో, ఫుట్‌బోర్డ్‌మీదే వ్రేలాడసాగేడు గోపాలం, ఉషకి ఆరడుగు దూరంలో.

'రైట్ రైట్' అంటూ ఈలవేసేడు బస్సు తాలూకు క్లీనరు. యాభై పై చిలుకు యువక హృదయాలను, వాటిబరువునూ మోసుకుంటూ భారంగా ఆర్.కె. మిషన్ ఎత్తు ఎక్కసాగింది నెంబర్ టెన్.

ముందు సీట్లలో 'పేస్టు'లా కూరుకుపోయిన అమ్మడ్లూ, అంత రష్‌లోనూ వీలైనప్పుడల్లా వాళ్ళ కళ్ళల్లోకి కళ్ళు కలిపేసే ప్రయత్నం చేస్తున్న బాబ్జీలూ ఎప్పుడు సడెన్‌బ్రేకు పడుతుందా, మొత్తం దేహాన్ని అంగుళం దూరంలో నిల్చొన్న అమ్మాజీలకు అంకిత మిచ్చేద్దామన్నట్టున్న అబ్బాయిలూ, —

అందరూ ఒక్కసారిగా — అదిరిపడి, క్రిందపడ్డానికి చోటులేక ఒకరిమీదొకరు పెటిలైపోయి, తేరుకు చూచేసరికి —

ఎదురుగ వస్తున్న బస్సుతో 'ఢీ' కొనేంత పన్చేసి, తక్కున ఆగిపోయిన 'టెన్‌బస్సూ',

ప్రక్కనేఉన్న ఇసుక డిబ్బలోంచి బట్టలు సర్దుకొంటూ, పుస్తకాలు ఏరుకొంటూ అయోమయంగా లేస్తున్న గోపాలం తదితరులూ, బెలన్సు తప్పి, తమమీద వాలిపోయిన అమ్మాజీలను అలాగే అన్చుకొని, 'ఈ క్షణం శాశ్వతమైపోతే ఎంత బావుణ్ను!' అనే ఫీలింగుతో యదార్థాన్నుంచి ఊహాలోకంలోకి పరుగుతీసిన ముందు వరుస అబ్బాయిలూ! —

చేతిలో పుస్తకాల్ని సర్దుకుంటూ, మోచేతికి తగిలిన చిన్నసైజు దెబ్బలనూ, నుదుటికి గీసుకున్న గీతలనూ తనకు తనే పరామర్శించుకొంటూ, కళ్ళజోడు సర్దుకుంటూ వస్తున్న గోపాలాన్ని చూసేసరికి, అంత సీరియస్ సిట్యుయేషన్‌లోనూ విపరీతంగా నవ్వొచ్చేసింది ఉషకి.

ఈ లోగా బస్సులో జనాలు 'షాక్' నుండి తేరుకోవడం, 'కాస్త కళ్ళు తెరిచి, వళ్ళు దగ్గర పెట్టుకు నడపవయ్యా బస్సుని! అసలే ఈ సిటీ బస్సు ప్రమాదాలు ఈ ఎత్తుపల్లాల ఊళ్ళో ఎక్కువైపోయినయ్!' అని ఒకరూ, 'ఔనౌనూ, మొన్న నెంబర్ సెవెంటీన్ తల్లక్రిందులై ముగ్గురు పాసింజర్లు అక్కడికక్కడే చచ్చిపోయేరు, ఆరడజనుమందికి పైగా కాళ్ళూ, చేతులూ ఊడిపోయినయ్! రాత! విమానాలూ, రైళ్ళూ అనుకుంటే వాటిని మించిపోయినయ్ ఈ బస్సు ప్రమాదాలు! 'అని మరొక నడిమి వయస్కుడూ,' 'అదేనవిటి, 'ఎల్లమ్మతోట జంక్షన్'లో డౌను దిగుతూ బ్రేకులొదిలేసిన నెంబర్ ట్వెంటీ సంగతేం చేసేరు? డ్రైవరు వప్పైపోయేడు! ముందు వర్సలో ఆడంగులు ఆనవాలు తెలీకుండా పచ్చడైపోయేరు! అన్ని ఏక్సిడెంట్లు జరిగినా ఈ డ్రైవరుగాళ్ళకు బుద్ధిరాదు!'— అంటూ మరొక 'మందువా' మార్కు బట్టతలాయనా — స్టేట్‌మెంట్లియడం, అందరూ జాగ్రత్తగా సర్దుకున్నాక విట్లేసేవాళ్ళు విట్లేస్తుండగా, సీరియస్‌గా తిట్టేవాళ్ళు కండక్టరుకీ, డ్రైవరుకీ తిట్లేస్తుండగా—మెల్లగా 'అప్పు' ఎక్కసాగింది నెంబర్ టెన్.

వెనకాల జనాలు బస్ 'షాక్' నుండి తేరుకొన్న సమయంలో, అబ్బాయిల స్పర్శతాలూకు 'షాక్'నుండి అమ్మాయిలూ, వాళ్ళస్పర్శ తాలూకు 'షాక్'నుండి అబ్బాయిలూ కూడా ఓ మోస్తరుగా తేరుకున్నారు. మరీ 'క్లోజప్పు' షాకు తిన్న అమ్మాజీలు 'ఏక్సిడెంట్లు కూడా అప్పుడప్పుడు మధురంగా ఉంటయ్ సిమ్మ!' అన్నట్టు భుజంమీదకు తలవంచేసుకొని ప్రక్కనున్న స్నేహితురాళ్ళ వైపు చూస్తూ ముసిముసిగా నవ్వేసుకోసాగారు. ఉష మాత్రం మెడను వెనక్కుతిప్పి ఫుట్‌బోర్డ్‌మీద వ్రేళ్ళాడుతున్న గోపాలాన్ని చూసి మళ్ళీ నవ్వింది; సరిగ్గా అదే సమయానికి గోపాలం కళ్ళజోడు ఆ విషయాన్ని కనిపెట్టేసింది. 'బస్సు దిగనీయ్, ఈ పాప పని చెప్తా'ననుకొన్నాడు గోపాలం.

మరో రెండు స్టాపుల తర్వాత కాలేజీ గేటు దగ్గర బస్సాగింది. ఫుట్‌బోర్డు దిగి పక్కనే నిల్చున్న గోపాలం చేతిలో, —ఎటో చూస్తున్నట్టుగా ముఖం పెట్టి, పరధ్యాన్నం నటించి, టిక్కెట్టు ముక్క పెట్టేస్తూ ఠీంగున దిగింది ఉష. ఆ సీను చూసిన ముగ్గురబ్బాయిలూ, ఇద్దరమ్మాయిలూ ఘొల్లున్నవ్వేరు! గుటకలు మ్రింగడం మినహా అప్పటికేం చేయలేక పోయాడు గోపాలం.

* * *

రెండురోజులు ప్రిపేరయ్యి, ఓ శనివారం మధ్యాహ్నం లైబ్రరీ దగ్గర కాసి, ఒంటరిగా వస్తున్న ఉషకి అడ్డమెళ్ళి ఆపేడు గోపాలం. ఏ మాత్రం బెదరలేదు ఉష. 'యస్, వాడ్యూవాంట్?' అన్నది దీమాగా, కాన్వెంట్ ఇంగ్లీషు నంతట్నీ ఉపయోగించి. ఆనక మళ్ళీ అందంగా నవ్వింది. అంతే! సబ్జెక్టు మర్చిపోయేడు—'సోల' ఐపోయిన గోపాలం. ('సోలై'పోవడమంటే అమ్మాయి నవ్వే సరికి ఐస్సైపోయి, కుంచించుకు పోవడం, ఆనక బొటనవేలి గోరు తినేస్తుండడం అట !).

'అరె, మీ బొటనవేలి గోరు తినేస్తున్నారు. అరక్క అజీర్తి చేస్తుంది, అసలు సంగతేవిటో చెప్పండి మిస్టర్ గోపాల్ !' అంటూ ఇంకా అందంగా నవ్వింది ఉష.

'ఆఁ! నాపేరు కూడా మీకు తెల్సి పోయిందా! ఆహా!' అని బైటి కందామనుకొని, సంతోషాతిశయం మూలంగా నోరు పెగలక, అవధులు దాటేస్తున్న ఆనందాన్ని పట్టలేక, పక్కనే ఉన్న 'ఎలక్ట్రిక్ పోలు' ఎక్కేయబోయేడు గోపాలం!

'దాన్ని ముట్టుకోకండి; అప్పుడప్పుడూ లూజ్ కనెక్షన్స్ మూలంగా షార్టయ్యి షాకొట్టేయగలదు. ఇంతకీ సంగతేవిటి?' అంటూ పగలబడి నవ్వింది ఉష.

'మీరు నన్ను చూసి ఎందుకు నవ్వేరు?'—అని ఇంకేం అడగ్గలడు గోపాలం? అంచేత అడగలేక అలాగే ఉండిపోతే ఉష చొరవగా ముందుకొచ్చి 'చూడండి మిస్టర్ గోపాల్' ప్రస్తుతం మీ పొజిషన్ ఎలావుందో నాకు బోధపట్టం లేదు. బహుశ మిమ్మల్ని చూసి నేనెందుకు నవ్వేనని అడగాలన్నది మీ ఉద్దేశ్యమనుకొంటాను. అదే అయితే చెప్తున్నా వినండి — ఆ రోజు మీరు ముఖానికి కొట్టుకున్న కోటింగ్ డ్రామా ఏక్టర్ మేకప్‌ను గుర్తుకు తెచ్చింది. సరిగ్గా మనసుకోక అర్జెంటుగా వచ్చేసేరేమో, మెడనిండా, ముఖంనిండా డబ్బాన్నర పౌడరు కన్పిస్తుంటే 'ఎవరీ కేండిడేటు?' అన్నేనడిగితే, నా ఫ్రెండు మీరు ఫలానా గోపాలమనీ, ఫలానా చదువు చదూతున్నారనీ చెప్పింది. మీ కోటింగూ వ్యవహారం చూసి మరి నవ్వు వాపుకోలేక పోయాను! తెల్సా?' అంటూ మళ్ళీ నవ్వింది.

ఈసారి గోపాలం ఉష నిల్చొన్నచోట నేలమీద ఏవిటో వెదకసాగేడు.

'సీ మిస్టర్! ఏవిటివెదుకుతున్నారు?' అన్నది నవ్వాపేసి, అయోమయంగా చూస్తూ.

'అ...అబ్బే...మరి,...మరి... అందమైన అమ్మాయిలు నవ్వితే నవరత్నాలు రాల్తాయని అంటారు గదా... అవేమైనా కాస్సి ఏర్పాటైనవేమోనని...' నసిగేడు గోపాలం.

'విట్లెయ్యడం ఇంక ఆపండి మిస్టర్!' సీరియస్‌గా ముందుకు నడిచింది ఉష.

'సా...సారీ...'

'వెనకాలొస్తూ సారీగాయాలు పాడక్కర్లేదు. ఇంక మీరు వెళ్ళొచ్చు!'

'అబ్బబ్బ...ఏం విట్టేసేరు! అహాస్ట్! మేడమ్. మీ విట్టు అద్భుతం, అమోఘం! గత అయిదారేళ్ళగా ఇంతటి విట్టు ఎక్కడా పేల్లేదు. నిజం చెప్పాలంటే నా 'నవరత్నాల విట్టు' మీ మనసుకెంతో నచ్చేవుంటుంది. నా ఎదురుగ్గా నవ్వితే బావోదని, ఇంటికెళ్ళి నవ్వుకుందామని నవ్వునాపెట్టుకున్నారు కదూ, ఔనుకదూ, చెప్పరూ, ప్లీజ్!...'

'షటప్!' అన్నది ఉష విసురుగా.

'ఎవరే, ఈ బాడీగార్డూ?'— అన్నది అప్పుడే అక్కడ ఎదురైన సుందరి.

'ఈయన విట్లేసేట్ట! నవ్వమని బలవంత పెట్టేస్తున్నాడు!'

'పోనీ నేన్నవ్వనాండీ 'విట్లాచార్య' గారూ? హి...హి...హీ...హాలా?' అంది వెక్కిరిస్తున్న ధోరణిలో సుందరి.

'ఒకటి...రెండు మూడ్నాలుగ్గు... ఐదారేడెనిమిది...పది...పన్నెండు...అరె, సగం నోరు తెరిస్తేనే పాతికపళ్ళు బైట పడ్డాయ్, పూర్తిగా ఐతే వో నలభై పైచిలుకు ఉన్నట్టున్నాయే మీ పళ్ళు? మీరే పేస్టు వాడ్తారూ? రేపట్నుంచి అది మార్చేయండి...?' గడగడా అనేసాడు పక్కమ్మాయితో గోపాలం. చిన్నబుచ్చుకుని మూతిని సున్నాలా చుట్టేసుకొంది సుందరి.

'మీ ఉచిత సలహాకు సంతోషించాం. ఇంకి బాడీగార్డ్నని మాని, వెళ్ళి రావచ్చు...' అంది ఉష.

'వెళ్ళి రావచ్చా? ఎంతసేపట్లో? ఎక్కడికి?...'

'మిస్టర్, విట్లెక్కువవుతున్నాయ్, కంట్రోల్ యువర్‌సెల్ఫ్!' హెచ్చరించింది ఉష. ఉడుక్కోలేదు గోపాలం. పైగా, ఇంకా అనుసరిస్తూనే 'నేను మీకు బాడీగార్డ్నా? సరే, ఈవేళ్టి నుండి అదేపనిచేస్తా! మాకు బాడీగార్డ్ నవడం నాకిష్టమే! ఐల్లైకిట్. ఒకే—సీయూ!' అంటూ ముందుకు వెళ్ళిపోయేడు.

ఆనాటి నుంచీ గోపాలం ఉషను కేంద్రంగా, మూడడుగుల వ్యాసార్ధంతో ఒక వృత్తం నిర్మించి, ఉష హాస్టలొదిలిన మరుక్షణం నుండీ, ఆ వృత్తం లోలోపలే మసల సాగేడు. ఉషపాప బీచ్‌కి షికారెళ్ళినా, టౌన్‌కి షాపింగుకెళ్ళినా, మరెక్కడికెళ్ళినా, కూడానే ఉంటూ 'పాప' వంటిమీద ఈగనైనా వాలనీయకుండా ... [illegible] ... కుండా [illegible]

టువ తెలిసీ తెలియని ఈగ ఏదైనా ఉష మీద వాల్తే, దాన్ని తరిమి పట్టుకొని రెక్కలుపీకి, కాళ్ళు విరిచేసి చంపేసేవాడు. ఏ స్నేహితుడికైనా 'గోపాలం ఎక్కడున్నాడూ?' అనే అనుమానమొస్తే, ఎక్కడ ఉష ఉండునో, అక్కడే గోపాలం ఉంటాడు!' అంటూ ప్రతి రెండోవాడూ అతని అనుమానం వెంటనే తీర్చేస్తాడు. లేకపోతే, 'అరె, ఇప్పుడే ఉష అలా లైబ్రరీవైపు వెళ్ళింది, ఆ చుట్టుప్రక్కల మూడొందల అరవై డిగ్రీలలో ఏదో ఓ ఏంగిల్‌లో గోపాలం ఉండగలడు, అని అతని ఎడ్రస్ చెప్పేయగలరు. ఆఖరికి గోపాలం టెలిగ్రాఫ్ ఎడ్రస్ 'కేరాఫ్ ఉష'గా మారిపోయి కూర్చుంది. ఇలాగ మూడ్నెల్ల కాలంలో ఉష ఎడనే నడుస్తూ మూడు జతల ఎక్స్‌ప్లాజివ్ బూట్లు అరగొట్టేసిన గోపాలం అంటే ఆవూరి 'బాటా' షాపు వాళ్ళకి ఎంతో అభిమానం, ఆదరణాను! 'మీలాంటి వారి మూలంగానే మిస్టర్ గోపాల్, మా బూట్లకంపెనీ దిన దిన ప్రవర్ధమాన మవుతుంది, మీకివే మా జోహార్లు!' — అంటూ గోపాలానికి అంజలి ఘటించేవాడు బోళ్ళకొట్టు సేల్స్‌మేన్. ఇంకో ఆయన 'మీ బూట్లు ఉధృతమైన అరుగుదల రహస్యమేమిటి?' అంటూ ఫొటోతీసి, ఇంటర్వ్యూ చేసేడు. 'ఉష!' అన్నాడు గోపాలం సగర్వంగా. 'ఆమె చల్లగా ఉండాలి, ఆమె లాంటి అందమైన అమ్మాయిలంతా చల్లగా ఉండాలి! అప్పుడే మా షాపు వర్ధిల్లుతుంది. దేవుడు ఉషను బ్రోచుగాక!' అంటూ వోల్డ్ సేల్స్‌మేన్ ఆశీర్వదించాడు, గోపాలానికి మరికొత్త బూట్లజతను అందిస్తూ.

'అదుగో, ఉష బాడీగార్డు!' అంటూ చెప్పుకు కొరుక్కునేవారు ఉష స్నేహితురాళ్ళు. కొన్నాళ్ళకి వాళ్ళూ వాళ్ళ బంధుమిత్రులూ అంతా గోపాలం పేరు 'గోపాలం' అని పూర్తిగా మర్చిపోయి కేవలం 'బాడీగార్డు' అనే వ్యవహరించేవాళ్ళు. 'ఉష పాపకి కూడా బాడీగార్డు బాగా అలవాటైపోయాడు. బైటకొస్తే బాడీగర్డు కన్పించకపోతే ఏదో వస్తువును

కొట్టేయినట్టు ఫీలయ్యేది. బాడీగార్డుంటేగాని షాపింగుకీ, పిక్చర్‌కీ వెళ్ళబుద్ధేసేదికాదు ఉషకి.

'ఏవోయ్. మధ్యాహ్నం పిక్చర్ కెళ్తున్నట్టు బాడీగార్డ్‌కి తెల్సా?' అన్నది సుందరి ఆ ఆదివారం మధ్యాహ్నం 'లంచ్' తీసుకుంటూ.

'ఈవేళ ఎక్స్‌పెక్ట్‌చేసి జంక్షను కాస్తుంటాడు. నీకేం అనుమానం అక్కర్లేదు' అన్నది.

'ఏవిధంగా చూస్తుంటే నువ్వే అతన్ని ఎంకరేజ్ చేస్తున్నట్టున్నావోయ్ ఉషా. అతను నీవెనకాల పడడం నీకానందంగా ఉన్నట్టుంది కానా?'

'ఊరుకోవోయ్, నాకేం ఇంట్రెస్టు? నా వెనకెందుకొస్తావని అడిగేందుకు మనకేం హక్కుంది? ఒకవేళ అలాగే అడిగితే 'ఈ రోడ్డు మీ గ్రేండ్‌ఫాదరు వెయ్యించేడా?' అంటాడు బాడీగార్డు, 'నాతోబాటు సినిమాకెందుకొచ్చావ్?' అంటే 'ఈ సినిమాహాలు మీ అంకుల్ కట్టించేడా?' అంటాడు. అప్పుడేం చేస్తాం?' అడిగింది ఉష, సర్వర్‌కి 'ఐస్' తెమ్మని ఆర్డరిస్తూ.

'అలాక్కాదు. పదుగురిలోనూ వాణ్ణి ఆపుజేసి, 'హోయ్, అలా నా వెనకపడ్డానికి సిగ్గులేదూ?' అని దులిపెయ్.'

'ఒకవేళ 'సిగ్గులేదు,' అని ఒప్పేసుకుంటేనో?'

'నీ ఖర్మ, అనుభవించు!'

'పోన్లేవోయ్, అలా వెనకాలొస్తే పోయిందేముంది, ఏదో విజిల్స్ వేస్తుంటాడు, వేస్తే నవ్వుతాం. లేకపోతే లేదు. చాలామంది అసహ్యంగా చేసే అల్లరికంటె బాడీగార్డు అందంగా చేసే అల్లరి ఏవిధంగా మెచ్చుకోదగ్గదే! అసలు అందంగా అల్లరిచెయ్యడం గొప్ప 'ఆర్టు' సుమా! ఆ 'ఆర్టు'లో బాడీగార్డు అందెవేసిన చెయ్యి!'

'బస్ బస్ బస్ ... చూస్తుంటే మెల్లగా మనసును బాడీగార్డుకి అంకితం చేసేస్తున్నావల్లే ఉంది...'

'చెక్!' అంది ఉష 'లంచ్' ముగించి లేస్తూ.

'కమాన్, త్వరగా తెమిల్చి డ్రెస్ చేసుకో' అంటూ రూమ్‌కి పరుగెత్తింది

# హ్యాపినెస్...

ఉష.

* * *

చీరలు వెతుకుతూ 'రోజ్ కలర్ శారీ' పైకితీసి పట్టుకొంది ఉష. ఈ శారీ బాడీగార్డుకి మహా చెడ్డ ఇష్టం. 'అన్నింటికంటె మీకు గులాబిరంగు శారీ చాలా బాగా సూట్ అవుతుంది. ఉషా. రోజ్‌కలర్ డ్రెస్సూ, జారిపోతున్నట్టుగా మీరు ఏర్పాటు చేసుకొనే గులాబీపువ్వు—వీటితో మిమ్మల్ని చూసినప్పుడు గులాబీ ఏదో, ఉష ఏదో పోల్చి చెప్పుకోవడం గొప్ప కష్టమైపోతుంటుంది! ఈ డ్రెస్‌లో మిమ్మల్ని చూడ్డం నాకెంతో ఇష్టం!' అన్న బాడీగార్డు మాటలు గుర్తుకొచ్చి అలాగే రెండునిముషాలు నిల్చుండిపోయింది ఉష.

'హోయ్, ఏమిటోయ్ తన్మయత్వం ఫీలవుతున్నావ్. నాహో, బాడీగార్డుగారిక్కి ఇష్టమైన డ్రెస్‌తీసి, పగలే కలలుకనేస్తున్నావా? ఐసీ ... నే చెప్పలేదూ? మనసు 'కేరాఫ్ బాడీగార్డు'గా మారిపోతుందని!...' అప్పుడే అక్కడికొచ్చిన సుందరి ఉష మనసును చదివేసింది.

'ఊరుకోవోయ్, అటువంటిదేమీలేదు. కావలిస్తే చూడు, ఈ వేళ అతనికి 'లెఫ్ట్ అండ్ రైట్' ఇచ్చేస్తా! షరేనా?' అన్నది ఉష, ఉడుక్కుంటున్నట్టుగా మూతిపెట్టి.

'చూద్దాంగా!' అన్నది సుందరి.

'చూద్దాం!' అన్నది ఉష.

'నడు నడు ... తెములు, లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేస్తావో, మనసు తీసికెళ్ళి అర్పించేస్తావో...' అంటూ బైటికి పరుగెత్తింది సుందరి.

రెండు నిముషాల్లో టాయిలెట్ అయి బయల్దేరింది ఉష. పక్కరూంలో బాతాఖానీ ఆపుజేసి ఉషను జాయిన్ అయ్యింది సుందరి.

'అరె, బాడీగార్డు లేడే?' అన్నది ఆశ్చర్యంగా ఉష, జంక్షన్‌లో ఎవరూ లేకపోవడం చూసి.

'ఔను, నిజమే! ఎనిమిదో వండర్!' అన్నది సుందరి. ఐదు నిముషాలు జంక్షన్‌లో ఆగి, 'నడవ్వోయ్, మెల్లగా నడుద్దాం, ఆనకవస్తే బస్సెక్కుదాం!' అన్నది ఉష.

'నాకుతెల్సు నాకు తెల్సు, ఎందుకు నడుద్దాం అంటున్నావో?' అంటూ సంబరపడిపోయింది సుందరి.

'ఎందుకూ?' అయోమయంగా ఉష.

'ఎందుకా, బాడీగార్డు లేటు కవరు చేసుకుంటాడని నువ్వు...'

'షెటప్!' కోపం అభినయించింది ఉష.

'సర్లేగాని, చూడు, జనం ఎలా నీ వైపు ఆశ్చర్యంగా చూస్తున్నారో?'

'ఎందుకూ?' మళ్ళీ అడిగింది ఉష.

'వెనకాల బాడీగార్డు లేకపోయే సరికి ప్రపంచంలో 'ఎనిమిదోవింత' ఏమిటో వాళ్ళకి తెల్సిపోయింది!' అన్నది సుందరి.

'ఏమిటి సుందరీ, ప్రతి విషయాన్ని తీసుకొచ్చి ఆఖరికి బాడీగార్డుకి కనెక్షన్! అది తప్పితే మనకి వేరే టాపిక్కులేదా? ఈ లెక్కన నాకంటె ఎక్కువగా నువ్వే అతన్నిగురించి ఆలోచిస్తున్నట్టున్నది. కానా?'

'కాహాను! ఇందాకట్నుంచీ కళ్ళు వెనక్కూ వెనక్కూ చూస్తున్న వెందుచేతనో మరి?...' 'జోకింది' సుందరి.

ఏదో అనబోతున్న ఉష, ప్రక్కనుంచి వెళ్తూ 'అరె, గోపాలమేడీ?' అన్న ఇద్దరబ్బాయిల ప్రశ్న విని ఉలిక్కిపడింది.

'హలో ఉషా, పిక్చర్కా?...అరె, వేరీజ్ యువర్ బాడీగార్డ్?' కనుబొమ్మలు పెద్దవి చేస్తూ ఆశ్చర్యంగా నోరావిలేసింది ఎదురుగా వస్తున్న కామాక్షి.

'అమ్మాయిగోరూ, రిక్షా తెమ్మంటారామ్మా? అరె, కళ్ళద్దాల బాబుగారేరమ్మా?' అప్పుడప్పుడు కట్టె—మొఖం గుర్తున్న రిక్షావాడు విస్తుపోయాడు.

'అమ్మా ఉషమ్మగారూ, గోపాలంగారికే రమ్మా, ఆయనకో టెలిగ్రాం వచ్చింది... ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం!' టక్కున ఎర్ర రంగు సైకిలాపి, కంగారుపడి, అడిగేస్తూ నిల్చుండిపోయాడు 'టెలిగ్రాం వాడు.'

'యేటమ్మా, పొద్దుట్నుంచి యిస్తానమ్మ నార్ను, మళ్ళీ రూమ్‌లో యెప్పుడూ కనిపించనేలేదు, కాస్త తెలవరెనా చెప్తుందమ్మా గోపాలం బాబుకో...'

రోడ్డుమీద అడ్డంగా ఆపుజేసి అడిగేసి వెళ్ళిపోయింది పాలమనిషి.

ఉషకి చిర్రెత్తిపోయింది. ఏం చెయ్యాలో తోచలేదు. దానికితోడు పుండు మీద కారం జల్లినట్టు సుందరి నవ్వు! ఉక్రోషం పట్టలేక 'సుందరీ, విల్ యూ ప్లీజ్ స్టాప్ లాఫింగ్?' అని అరిచింది.

'మొగుడు మొట్టినందుక్కాదుట, తోడికోడలు నవ్వినందని ... ఆ సామెత విన్నావా ఉషా?—' నవ్వాపుకొంటూ అన్నది సుందరి.

'ఐతే నువ్వు నా తోడికోడలివా ?. నా ఖర్మ !' మాటకు మాట జవాబు చెప్పే ధోరణిలో అన్నది ఉష.

ఫక్కున్న నవ్వి, ఆపి, 'ఐతే నీ మొగుడూ...' అంటూ కళ్ళు చక్రాల్లా తిప్పి, దూరంగా జరిగింది సుందరి.

'షటప్!' బస్సు షెల్టర్లో ఆగి పోయింది ఉష.

'అలా ఉడుక్కోకోయ్ గోపాలంగారు రాలేదనీవేళ ! కంగారు పడకు, ధియేటర్లో ఏర్పాటైపోతారు బాడీగార్డుగారు, అదే, అదిగో బస్సొస్తుంది...'

బస్‌రావడం తరువాయి, ఛెంగున గెంతి నట్టు ఎక్కి కూర్చున్నది ఉష. 'టికెట్ ప్లీజ్!' అన్న కండక్టరు ఉష చుట్టూ కలయజూసి, గోముగా నవ్వుతూ 'గోపాలం బాబేరమ్మా?' అన్నాడు. 'రాస్కెల్,!' అంటూ లేచి నిల్చుంది ఉష.

'ఎవరూ, ఆయనా, నేనా?' అన్నాడు కండక్టరు, అమాయకంగా.

'నువ్వే, నువ్వే రాస్కెల్‌వి, నువ్వే ఇడియట్‌వి, నువ్వే ఫూల్‌వి...' కోపంతో ఉష చెక్కిళ్ళు ఎర్రబడ్డయ్. సుందరి కూర్చోబెట్టేసి, ఊరుకోబెట్టింది.

'ఇంకానయం, గోపాలంబాబు నన్నా రనుకొన్నాను, నన్నే ఐతే ఫర్వాలేదు—' దూరంగా వెళ్ళిపోతూ గొణుక్కున్నాడు కండక్టరు.

మూడ్ చెడిపోయింది ఉషకి. దాంతో సుందరికూడా సీరియస్సైపోయింది. ఇద్దరూ నిశ్శబ్దంగానే సినిమాలోకూర్చుని కాస్సేపు నిద్రపోయి, ఎలాగో విరామందాకా గడిపేసి, గబగబా లేచి, బైటకొచ్చేసి 'నాన్న కాఫీ తాగుదాం పదవోయ్ !' అనుకొంటూ పక్కనే ఉన్న 'ఊటీ హోటల్'లో దూరేరు. ఎయిర్ కండిషన్డ్ రూమ్ తలుపుతెరిచి లోపలికి అడుగు పెట్టిన ఉష ఒక్కసారి ఆగిపోయింది.

ఎదురుగా—

బాడీగార్డు !

మధ్యాహ్నం జరిగిన సంఘటనలూ, వళ్ళుమంటా, సినిమాతాలూకు తల నొప్పీ అన్నీ కల్సి ఉషని వెర్రెక్కించి నయ్. 'ఐవిల్ సీ ది యెండ్ ఆఫ్ దిస్ ఫెలో టుడే'—పళ్ళు పటపట లాడిస్తూ లోపలికివెళ్ళి గోపాలం ఎదురుగా కూర్చున్నది.

ఆ క్షణాన వెయ్యిన్నర ట్యూబులైట్ల కాంతితో గోపాలంముఖం మెరిసిపోయింది. అప్పటివరకూ ఎదురుగావున్న ఇడ్లీ ప్లేట్‌మీద 'వర్క్‌చేయడం' మర్చిపోయి, అవాంతం 'సోలై'పోయాడు! ఆ 'సోల' ఐపోయే ప్రోసెస్‌లో తన చేతిగోళ్ళన్నీ అయిపోవడంతో. ప్రక్కనున్న పల్లెటూరి ఆసామీ చేతి గోళ్ళవైపు ఆప్యాయంగా చూడసాగేడు. ఆసామీ అనుమానంగా చేతిని కోటుతాలూకు లోపలిజేబులో పదిల పర్చుకొన్నాడు. దాంతో, గోపాలం ఏంవీ డిసప్పాయింట్ అయిపోకుండా, ఎదురుగా కూర్చున్న 'ఉషపాప' చేతివైపు గోముగా, లాలనగా చూసేడు. ఉషపాప సన్నగా, చురకల్లాగ, తీర్చిదిద్దినట్టు ఎంతో అందంగా వున్నయ్! పైగా ఎర్రటిరంగు వేయించుకుని చూడ ముచ్చటగా వున్నయ్! ఇంకా అటునుంచి రెండోవేలికి నవ రత్నాల 'రింగు' కూడా ఏర్పాటై ఉన్నది.

'అబ్...బ్...బ్బ! ఆ గోళ్ళను తినేస్తే యెంత బావుణ్ణు !' అనే, తలపొచ్చిన గోపాలం ఆనందాన్ని ఆపుకోలేక, వేళ్ళు నమిలేస్తూ, చుట్టుప్రక్క లెక్కడైనా 'కరెంటుపోలు' ఉందేమోనని కలయ జూసేడు. 'ఎయిర్ కండిషండ్' రూమ్ మూలంగా ఆ యేర్పాటేం లేకపోయేసరికి నిరుత్సాహం ఫీ'లవ్వ'తూ ఉష వైపు చూసేడు.

అసలే అందంగా, చిన్నగా ఉన్న మూతిని ఇంకా చిన్నిదున్నాలా చుట్టి, మెల్లోలాకెట్టును పంచదారలా చప్పరిం చేస్తూవున్న ఉష 'మినియేచర్ వైజ యంతిమాల'లా ఎంతో అందంగా కన్పించింది దాక్షణాన !

అంతే ! 'అ...అ...అ...అ...ఈ... ఉ...షా!' అని, అక్షరాలు మర్చిపోయి నట్టు అరిచేసేడు గోపాలం, సంబరపడి పోతూ.

'ఛప్, పదవోయ్ సుందరీ పోదాం!' చివ్వున లేచి వెళ్ళిపోయింది ఉష. 'ఏమైనా సరే, మనసును విప్పి ఉష ముందు పెట్టెయ్యాలీవేళ?'—నిర్ణయించు కొన్నాడు గోపాలం, కాఫీ వదిలేసి.

చకచకా, టక్‌టకా నడుచుకొంటూ 'ఎల్లిస్‌గార్డెన్స్'—అనబడే 'ఎల్లమ్మ



తోటి' ఇరెక్షన్ కొచ్చేసింది ఉష, సుందరితో ఏదో రహస్యం మాట్లాడేస్తూ. చెవుల్నిండా జుట్టు కప్పేసుకున్న సుందరికి ఉష డైలాగులు సరిగ్గా వినిపించడం లేనట్టుంది, అనుమానం 'ఆc, ఆc? ఏవన్నావ్?' అంటూ రెట్టిస్తోంది. నడుస్తూ నడుస్తూ తిన్నగా వెళ్ళి హాస్పిటల్ డౌన్—సెంటర్‌లో ఆగి గట్టిగా ఊపిరి పీల్చుకొంది ఉష.

'ప్లీజ్ లిసన్ టుమి !' జాలిగా అడిగాడు గోపాలం, ఉష కళ్ళల్లోకి చూస్తూ. 'మీరావైపుకి వెళ్ళి నిల్చోరూ? ఐ హేవ్ టు టాక్ విత్ ఉషా !' అంటూ ప్రక్కనే ఉన్న సుందర్ని రిక్వెస్ట్ చేసేడు. 'హాకే' అనకుండానే, చురచురా చూస్తూ వెళ్ళి పేవ్‌మెంట్‌మీద సెటిలైంది సుందరి.

చేతులు రెండూ నడుంమీద బిగించి, 'రోజ్' కలర్ శారీలో. తలలో జారిపోతున్నట్టుగా వాడిపోయే స్థితిలో ఉన్న 'రోజ్'తో, రోజాకంటె ఎక్కువ అందంగా (గోపాలం కళ్ళజోడుకి) కన్పడుతూ, 'నా. ఏమిటి వచ్చినవేళ!' అన్నట్టు చిట్లిస్తున్న ఉషకు దగ్గరగా వెళ్ళేడు.

అసలే నాలుగురోడ్ల జంక్షనేమో, చాలా బిజీగా ఉండడంచేత ఎవరూ ఎవర్నీ పట్టించుకొనే వ్యవధానం లేదు, ఉష, గోపాలం తప్ప.

'మిస్టర్ గోపాల్ ! ఎందుకు నన్నిలా బాధపెడ్తారు? ఎందుకు నన్నిలా గోల చేస్తారు? నైటింగేల్ సిస్టర్ లోన్లీ ఎలోన్? సీరియస్‌గా చెప్తున్నా. లేనట్టుంటి నా జోలికి రావద్దు. అసలు నేనేం చేశాను? నన్నెందుకిలా—'

'నో నో ఉషా ! సారీ వెరీ సారీ. అంతా నేనే చేసేను. నాదే తప్పు. కారణం నాకూ ప్రేమించే హృదయముంది. అసలు అది హృదయంకాదు. కానీ ఇప్పుడా ప్రదేశంలో కోరికమాత్రమే—'ఉష' అనే రెండక్షరాల మంత్రమే ఉంటుంది. ఆ హృదయం మీదుగా భూగోళం ఒక్కటే పయనిస్తున్నట్టు—సారీ—కంగారులో భూగోళం అన్నాను—సైన్సు బుక్కులో తయారు చేస్తున్నట్టు 'అల్—మోస్ట్' అన్నట్టు 'ఉష్'

## భా వి ని..

ఉష్' అంటుంది. కావాలంటే ఒక్కసారి వినండి ఉషా ! దాన్నిండా ఉష పేరు పేరుకు పోయింది. ఉషే నా ప్రాణం ! నా ప్రాణానికంటె అధికం. ముందు ఉష. ఆనక నా ప్రాణమూను ! మిమ్మల్ని చూడనిదే ఒక్కక్షణం ఉండలేను, ఒక్క నిముషం బ్రతకలేను—'

'గో అండ్ హేంగ్ యువర్ సెల్ఫ్ ! బ్రతకలేకపోతే ఏందులోనైనా పడి—ఛావండి, ఈ క్షణాన్నుండి మీ ముఖం చూపొద్దు—గెటౌట్—గోటు హెల్ !—'

'ఉ...షా !' అంటూ అటూ ఇటూ చూసి, కంగారుగా, భయంగా, ఉషను ఒక్క త్రోపు తోసేడు వణికిపోతున్న 'బాడీగార్డు' ఉరఫ్ గోపాలం.

'తప్పుకోండి, తప్పుకోండి'—'అరెరె, అయ్యయ్యో ! ...' 'అమ్మోయ్—బాబోయ్'...'అరెరె...'—జంక్షన్‌లో భయంతో చలించిపోతున్న జన సమూహం.

'రాస్కెల్ !' అంటూ పేవ్‌మెంట్ మీద త్రుళ్ళిపడింది ఉష. తమాయించుకొని, లేచి వెనక్కి తిరిగేసరికి—

హాస్పిటల్ 'అప్' నుండి వేగంతో దూసుకుంటూ వచ్చేసి, బ్రేకులు పడికేసిన కారణంగా విరవిహారం చేస్తూ, ఇందాక తాను నిల్చున్న చోటికి పీమగా దూసుకుపోయి ఎదురుగా ఉన్న పెద్దగోడలోకి దూసుకొని ఆగిపోయిన సిటీబస్సూ, జన సందోహం. అరుపులూ, పెడబొబ్బలూ... దూరంగా జనం పరుగులూ—

'అయ్యయ్యో, లోపల ఎవరో కొట్టుకుంటున్నాడు—ఆస్పత్రికి తీసుకు వెళ్ళండయ్యా !...' చుట్టూ చేరిన పెద్ద గుంపు—

'అరెరే, భగవాన్ !...'

'చచ్చిపోయాడు కుర్రాడు ! లేచిన వేళ మంచిది కాదు !'

'బస్సు ఇంకేం బతుకుతాడు, వళ్ళంతా చచ్చిపోతే ! ... క్షణంలో భీభత్సంగోల, అరుపులూ, కేకలూ, పెడబొబ్బలూ... క్షణంలో భీభత్సమైపోయింది ఆ సెంటరు.

నుదుటిమీద గీరుకున్నచోట తడుముకొంటూ 'ఏ...మ...య్యా...ని...మ్మ...ం...ది?...' అంటూ కంపించిపోయింది ఉష.

'ఆ కళ్ళజోడు కుర్రాడెవరో పచ్చడి చేసి పోయింది వెధవబస్సు ! కుర్రాడికి నూకలు మిగల్లేదు !...' ఎవర్నో భయంగా అడిగిన సుందరికి ఎవరో సమాధానం చెప్పేరు.

'కెవ్వు'మని అరిచింది ఉష. విపరీతమైన జనసమూహం మూలంగా అతన్ని చూడ్డానికి కూడా ఏమాత్రం అవకాశం లేకపోయింది ఉషకి.

'నిజమా? సుందరీ...నిజమేనా?...' కళ్ళు తిరిగి కుప్పలా కూలబడిపోయింది ఉష.

'అరె...అరె...' అంటూ రిక్షాను పిల్చింది సుందరి.

* * *

'నేనే, నేనే కారణం. నన్నూ చంపెయ్ దేవుడా ! నన్నూ చంపెయ్ !...' తలబద్దలు కొట్టుకొని వెక్కివెక్కి ఏడ్చింది ఉష.

ఆరోజు కాలేజికి సెలవిచ్చేరు— ఏక్సిడెంట్‌లో అన్యాయంగా చచ్చిపోయిన గోపాలానికి సానుభూతిగా.

ఉషను ఓదార్చలేక విసిగెత్తిపోయింది సుందరి. గుండెల్లో వెయ్యి అగ్నిపర్వతాలు బ్రద్దలయినట్టు కంపించిపోసాగింది ఉష. 'నేను బ్రతకను... బ్రతకలేను... చచ్చిపోతా... నన్నెవరైనా చంపెయ్యండి...' పిచ్చిగా తలబాదుకున్నది.

...మధ్యాహ్నమైంది. భోజనాలు పూర్తిచేసి, మునిసిపల్ అనుకోకుండా సెలవిచ్చినందుకు ఆనందపడుతూ మ్యాట్నీషోకి బయల్దేరిన హాస్టలమ్మాయిలవైపు ఉలికి, ఎర్రబడిపోయిన కళ్ళతో పిచ్చిదాన్లా చూస్తూ కూర్చుండిపోయింది ఉష.